నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శుక్రవారం 7 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

విత్తన దుకాణంలో రికార్డును తనిఖీ చేస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

విత్తన నిల్వపై బోర్డులు పెట్టాలి

- మార్కెట్‌లో 240 రకాల విత్తనాలు లభ్యం
- అందుబాటులో అన్ని రకాల విత్తనాలు
- కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం వ్యవసాయం, జూన్ 6 : వ్యాపారులు తమ తమ దుకాణాల ఎదుట విత్తన, ఎరువుల నిల్వలు తెలిపేలా తెలుగులో అర్థమయ్యే విధంగా బోర్డుపై ప్రదర్శించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. నగరంలోని గాంధీ చౌక్, బర్మాషెల్ రోడ్‌లో గల విత్తన, ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేసిన కలెక్టర్ స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్ బుక్‌లు, విత్తన బస్తాలపై లాట్ నెంబర్, ఎంఆర్‌పీ, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను నిశితంగా పరిశీలించారు. ఎరువులు, విత్తన విక్రయానికి పొందిన అనుమతుల పత్రాలను పరిశీలించడంతో పాటు ఏయే ప్రాంతాల నుంచి రైతులు ఎక్కువగా వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గత సీజన్‌లో ఏ పంట సాగు చేశారు? ఏ రకం విత్తనాలు కొన్నారు? ఎంఆర్‌పీపై ఇస్తున్నారా? అదనంగా అడుగుతున్నారా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో 240 రకాల విత్తనాలు ఉన్నాయని, ప్రతి రకం ఒకే దిగుబడి ఇస్తుందన్నారు. రైతులందరూ ఒకే రకం కావాలని డిమాండ్ పెంచి ఇబ్బంది పడొద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఎరువులు, విత్తన దుకాణాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తాయన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్ముతూ పట్టుబడితే ఎంతటివారైనా సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో విత్తనాలకు ఎక్కడా కొరత లేదని, అన్ని రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికల వద్ద విత్తన ఎంపికపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయాధికారి కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరుస వాయిదాలు!

పాలకవర్గ సమావేశాన్ని బహిష్కరించి ప్రత్యేకంగా సమావేశమైన డీసీసీబీ డైరెక్టర్లు

డీసీసీబీ పాలకవర్గ సమావేశాలు ఎప్పటికప్పుడు పోస్ట్‌పోన్
డైరెక్టర్లు, కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరపాలంటూ సభ్యుల డిమాండ్
గ్రామాల్లో ఇప్పటికే ప్రారంభమైన వానకాలం సీజన్ పనులు
సహకార సంఘాలు, టీజీ సీడ్స్, మార్క్‌ఫెడ్‌కు దిశా నిర్దేశం కరువు
విత్తనాల పంపిణీ గందరగోళం.. ఆందోళనలో రైతాంగం

ఖమ్మం వ్యవసాయం, జూన్ 6 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పాలకవర్గ సమావేశాలు కొద్ది నెలల నుంచి వరుసగా వాయిదా పడుతున్నాయి. ఫలితంగా సొసైటీల నిర్వహణ, రైతుల ప్రయోజనాల కార్యక్రమాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ప్రస్తుత బ్యాంక్ ఇన్‌చార్జి చైర్మన్ తీరు, పాలకవవర్గ సభ్యుల వ్యవహారం 'పిట్టపోరు.. పిట్టపోరు..' అన్న చందంగా ఉంది. పాలకవర్గంలో ప్రస్తుతం బీ క్యాటగిరీకి చెందిన డైరెక్టర్ స్థానంతో పాటు ఇటీవల మరణించిన ఓ డైరెక్టర్ స్థానం ఖాళీగా ఉన్నాయి. అలాగే మాజీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కూరకూల నాగభూషణం స్థానం కూడా ఖాళీగానే ఉంది. దీంతో ఆయా స్థానాలకు నూతన డైరెక్టర్ల ఎన్నిక జరగాల్సి ఉంది. అలాగే, కూరాకుల రాజీనామా తరువాత వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అందుకని ప్రస్తుత ఖాళీలను తక్షణమే భర్తీ చేయడంతోపాటు నూతన అధ్యక్షుడిని కూడా ఎన్నుకోవాల్సి ఉంది.

మూడు నెలలుగా ఎటూ తేలక..

అయితే మూడు నెలల క్రితం అప్పుడున్న ఖాళీల భర్తీకి ఎన్నికలు నిర్వహించేందుకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసి డీసీవోకు పంపాలని కోరుతూ మెజారిటీ సభ్యులు ఇన్‌చార్జి చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే వారి మాట నెగ్గలేదు. దీంతో నాటి నుంచి సదరు డైరెక్టర్లు అంటీ ముట్టనట్లు ఉంటున్నారు. దీంతో మరోసారి గురువారం పాలకవర్గ సభ్యుల సమావేశాన్ని ఇన్‌చార్జి చైర్మన్ దొండపాటి ఏర్పాటు చేశారు. మొత్తం 16 మంది డైరెక్టర్లకుగాను.. 12 మంది హాజరయ్యారు. అయితే సమావేశ అజెండాలో మరో మూడు అంశాలను పొందుపర్చాలని పలువురు డైరెక్టర్లు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఖాళీ స్థానాల్లో డైరెక్టర్ల ఎన్నికలు, చైర్మన్ ఎన్నిక, ఉద్యోగులు, అధికారుల ఏకపక్ష బదిలీలు వంటి అంశాలను ఆ అజెండాలో పొందుపర్చలేదు. దీంతో గురువారం కూడా డైరెక్టర్లు సమావేశాన్ని బహిష్కరించారు. వారంతా డీసీసీబీ అతిథి గృహంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఇప్పటికే వానకాలం సీజన్ ప్రారంభం

ఇదిలా ఉండగా.. ఏటా వానకాలం సీజన్‌కు ముందు, సీజన్ ప్రారంభం తరువాత పాలకవర్గ సమావేశం నిర్వహిస్తారు. సొసైటీల ద్వారా విత్తనాలు, ఎరువుల పంపిణీ, పంట రుణాలు, ఇతర రైతుల అవసరాలపై సమీక్షలు చేపడతారు. అయితే ఇంతటి ముఖ్యమైన ఈ సమయంలో రైతుల సమస్యలను గాలికి వదిలేసి పాలకవర్గ బాధ్యులు ఎవరికి వారు కేవలం సొంత అజెండాలకు ముందుకు తెస్తున్నారని, పాలకవర్గ సమావేశాలను వాయిదాలు పడేలా చేస్తున్నారని రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మార్కెట్లో పచ్చిరొట్ట విత్తనాల కొరత ఉంది. ఇతర విత్తనాల పంపిణీ కూడా ఆశించిన మేరకు జరగడం లేదు. ఇంకోవైపు రైతు రుణమాఫీపైనా సమీక్షించాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో పాలకవర్గం అవలంబిస్తున్న తీరు వల్ల బ్యాంకు అధికారులు, సొసైటీల బాధ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోసారి పాలకవర్గ సమావేశం రద్దు జరిగినట్లయితే మొత్తంగా పాలకవర్గమే రద్దయ్యే అవకాశం కూడా ఉంది. మరి ఇంతటి పరిస్థితుల్లో సభ్యులంతా రైతు ప్రయోజనాల కోసం పాలకవర్గ సమావేశాన్ని, జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహిస్తారో.. లేదో.. చూడాలి.

గెలుపు కోటా 1,55,095 ఓట్లు

- తొలి ప్రాధాన్యతలో తేలని విజేత
- 18,565 ఓట్ల ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న
- 1,04,248 ఓట్లతో రెండో స్థానంలో రాకేశ్‌రెడ్డి
- మొదలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- నేడు వెలువడనున్న తుది ఫలితం
- కౌంటింగ్‌లో ఏకపక్ష ధోరణిపై బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు

కౌంటింగ్‌లో సమస్యలను ఎస్పీ చందనా దీప్తికి వివరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఊహించినట్లుగానే తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలలేదు. బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం గెలుపు కోటాకు దూరంగా నిలిచిపోయారు. దాంతో విజేతను తేల్చేందుకు ఎలిమినేషన్ ప్రక్రియలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్‌లో తొలిరోజు సాయంత్రం వరకు కట్టలు కట్టే కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం 4 గంటల నుంచి మొదలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు రెండో రోజు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. మొత్తం నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగగా.. ఒక్కో రౌండ్‌కు కనీసం ఐదారు గంటల సమయం తీసుకుంది. ఇక ఎలిమినేషన్ రౌండ్ సైతం సుదీర్ఘంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నానికి తుది ఫలితం వెలువడి విజేత తేలనున్నట్లు అంచనా.

తొలి ప్రాధాన్యతలో తేలని ఫలితం

మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం నాలుగు హాల్స్‌లో 96 టేబుళ్లపై లెక్కింపు కొనసాగింది. కౌంటింగ్‌లో అందరి దృష్టి ప్రధాన అభ్యర్థులుగా భావించిన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్‌పైనే ఉంది. తొలి మూడు రౌండ్‌లలో తీన్మార్ మల్లన్నకు ఆధిక్యం లభించగా.. చివరి రౌండ్‌లో రాకేశ్‌రెడ్డి స్వల్ప ఆధిక్యతను ప్రదర్శించారు. నాలుగు రౌండ్లు ముగిసే సరికి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు, రాకేశ్‌రెడ్డికి 1,04,248 ఓట్లు, ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, అశోక్‌కుమార్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. ఇందులో మొత్తంగా తీన్మార్ మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక చెల్లని ఓట్లను వేరు చేసి.. చెల్లిన ఓట్లను పరిగణనలోకి తీసుకుని గెలుపు కోటాను ఫైనల్ చేశారు.

గెలుపు కోటాకు దూరంగా...

మొత్తం పోలైన ఓట్లల్లో తొలి ప్రాధాన్యత లెక్కింపు పూర్తయ్యాక పరిశీలిస్తే 25,824 ఓట్లు చెల్లనివిగా లెక్క తేలాయి. పట్టభద్రులై ఉండి కూడా నిబంధనల ప్రకారం ఓటు వేయడంలో వీరు విఫలం కావడం గమనార్హం. వీటిని తొలగించిన అనంతరం చెల్లిన ఓట్ల సంఖ్య 3,10,189గా తేలింది. వీటిల్లోంచి 50 శాతం ఓట్లు ప్లస్ ఒక్క ఓటును జత చేయగా గెలుపు కోటా 1,55,095 ఓట్లుగా నిర్ధారణ జరిగింది. ఈ ఓట్లను ఏ అభ్యర్థి అయితే సాధిస్తారో వారే విజేత కానున్నారు. ప్రస్తుతం అభ్యర్థుల వారీగా ఓట్లను పరిశీలిస్తే తీన్మార్ మల్లన్న గెలుపు కోటాను చేరుకోవాలంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో 32,282 ఓట్లు సాధించాలి. రాకేశ్‌రెడ్డి విజేతగా నిలువాలంటే 50,853 ఓట్లు ద్వితీయ ప్రాధాన్యతలో పొందాలి. ప్రస్తుతం ఎవ్వరూ కూడా గెలుపు కోటాకు చేరుకోలేకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

ఎలిమినేషన్ పద్ధతిలో విజేతగా..

అతి తక్కువ తొలి ప్రాధాన్యత ఓట్లు పొందిన అభ్యర్థి నుంచి పైకి ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా ఇందులో 10 ఓట్లు మాత్రమే సాధించి చివరలో నిలిచిన యాతాకుల శేఖర్ నుంచి ఎలిమినేషన్ మొదలైంది. శేఖర్‌కు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచివేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పైకి ఒక్కో అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను వేస్తూ వస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడ కౌంటింగ్ నిలిపివేస్తారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే చివరి వరకు తీన్మార్ మల్లన్నతోపాటు రాకేశ్‌రెడ్డి పోటీలో నిలువనున్నారు. అప్పటికీ కోటా తేలకపోతే రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కూడా మొదటి అభ్యర్థికి పంచివేస్తూ విజేతను ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా ముగిసి విజేత తేలాలంటే శుక్రవారం మధ్యాహ్నం వరకు సమయం తీసుకోవచ్చని అంచనా.

గెలుపుపై ధీమాలో కాంగ్రెస్, బీఆర్ఎస్

ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గెలుపుపై అటు తీన్మార్ మల్లన్న, ఇటు రాకేశ్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి తనకే ఎక్కువ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పోలవుతాయని భావిస్తున్నారు. అటు స్వంతంత్ర అభ్యర్థి అశోక్‌తోపాటు బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిలకు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లే విజేతను తేల్చడంలో కీలకంగా మారనున్నాయి. వీరికి పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు ఎటువైపు ఉంటే వారే విజేతగా నిలువనున్నారు.

కౌంటింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ ఆందోళన

కౌంటింగ్ కేంద్రంలో ఆర్వోతో పాటు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం మీడియా ముందుకు వచ్చారు. ఓట్ల లెక్కింపులో తమ అభ్యంతరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఫలితాలు ప్రకటించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పలు టేబుళ్లపై ఓట్ల లెక్కింపుతోపాటు మూడో రౌండ్‌లో తమకు సంబంధం లేకుండానే ఫలితాన్ని ప్రకటించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా కౌంటింగ్ కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్‌లో తమ అభ్యంతరాలను వ్యక్తపరుస్తూ ఎన్నికల కమిషన్‌తోపాటు అబ్జర్వర్ రాహుల్ బొజ్జకు, రిటర్నింగ్ అధికారి హరిచందనకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి లేఖను అందజేశారు.

జిల్లాలో 19 వరకు బడిబాట

- పాఠశాలల మరమ్మతు పనులన్నీ పూర్తి చేయండి
- 85 శాతం పాఠ్యపుస్తకాలను మండలాలకు పంపిణీ చేశాం..
- మండల ప్రత్యేకాధికారులతో సమీక్షించిన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

సమీక్షలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా బాల కార్మికులు, బడీడు పిల్లలు పాఠశాలల్లో ఉండే విధంగా కార్యాచరణ రూపొందించాలని, గురువారం నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. జిల్లాలో చేపడుతున్న బడిబాట, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఏకరూప దుస్తులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పనులు, పారిశుధ్యం, విత్తనాలు, సీజనల్ వ్యాధులు, తాగునీరు తదితర అంశాలపై మండల ప్రత్యేకాధికారులతో గురువారం ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని లేబర్ ఆఫీసర్లను ఆదేశించారు. 642 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులను ఈ నెల 12వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. 85 శాతం పుస్తకాలను అన్ని మండల కేంద్రాలకు తరలించామని, సోమవారం నాటికి పూర్తి కావాలన్నారు. జిల్లాలో 1,299 పాఠశాలలకు అవసరమైన 63,399 ఏకరూప దుస్తులకు.. 50,300 ఏకరూప దుస్తుల తయారీ పూర్తయిందని, మిగిలినవి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలన్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున తరగతి గదులు, పాఠశాల ఆవరణను శుభ్రం చేయించాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. జిల్లాలో 5,41,000 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం ఉండగా.. 4,94,000 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, 564 దుకాణాల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా విక్రయాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు 1,05,000 ప్యాకెట్ల పత్తి విత్తనాలు విక్రయించారని తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో విద్యాచందన, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఐదు నెలల వేతనాలు చెల్లించాలని ధర్నా

- భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఎదుట బైఠాయింపు
- 10 నుంచి సమ్మెకు దిగుతామని కార్మికుల హెచ్చరిక

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

భద్రాచలం, జూన్ 6 : పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఎదుట సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రికి కొత్త కాంట్రాక్టర్ వచ్చినప్పటి నుంచి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఐదు నెలలుగా వేతనాలు లేకుండా ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. వేతనాల కోసం ఫిబ్రవరి నెలలో ధర్నా చేయగా.. ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ ద్వారా జీతాలు ఇప్పిస్తానని ఐటీడీఏ పీవో హామీ ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా.. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఆర్ఎంవో రాజశేఖర్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఈ నెల 9న ఐదు నెలల జీతాలపై అధికారులతో మాట్లాడి కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. 9న వేతనాలు తమ ఖాతాల్లో పడకపోతే 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తూ నోటీసును ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అందజేశారు.

9న గ్రూప్-1 ప్రిలిమ్స్

- పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- జిల్లాల్లో తాగునీటి సరఫరాపై నివేదికలు పంపాలి
- విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావద్దు
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మామిళ్లగూడెం, జూన్ 6: ఈ నెల 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. 'గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణ, వానకాలం సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, తాగునీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం' తదితర అంశాలపై టీజీపీఎస్‌సీ చైర్మన్, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జూన్ 9న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని, గత అనుభవాల దృష్ట్యా ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, వానకాలం పంటల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల నిల్వలు కూడా జిల్లాల్లో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని అన్నారు. వాటి పంపిణీలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవిలో తాగునీటిని విజయవంతంగా సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతులైనందున మరో 20 రోజులు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రతి ఇంటికీ తాగునీటిని అందించాలని సూచించారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై సర్వే నిర్వహించి నివేదికను తమకు సమర్పించాలని సూచించారు. అలాగే, పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ప్రతి విద్యార్థికీ రెండు జతల స్కూల్ యూనిఫాం కుట్టించి అందజేయాలని ఆదేశించారు.

గ్రూప్-1 ప్రతిష్ఠాత్మకం: టీజీపీఎస్‌సీ చైర్మన్

అనంతరం, టీజీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్ష ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదని అన్నారు. ఏ చిన్న పొరపాటు కూడా లేకుండా సజావుగా చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు: ఖమ్మం కలెక్టర్

అనంతరం ఖమ్మం నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షల కోసం జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18,403 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, రూట్ అధికారులకు రెండో విడత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఏడీసీపీ ప్రసాదరావు, ఇతర అధికారులు రాజేశ్వరి, విజయనిర్మల, సన్యాసయ్య, శ్రీనివాస్, సోమశేఖరశర్మ, ఆఫ్రీన్ సిద్దిఖీ, భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసమే ఉచ్చు అమర్చాం..

ప్రమాదవశాత్తు గ్రామస్తుడు బలయ్యాడు
దీనికి పోలీసులే పూర్తి బాధ్యత వహించాలి
ఏసు మృతిపై మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

కొత్తగూడెం క్రైం, జూన్ 6 : పోలీసు బలగాల నుంచి తమ ఆత్మరక్షణ కోసం అమర్చిన బూబీట్రాప్స్ పేలి ఓ గ్రామస్తుడు మృతిచెందిన విషయంపై పూర్తి బాధ్యత పోలీసులే వహించాలని మావోయిస్టు పార్టీ వాజేడు-వెంకటాపూరం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో గురువారం లేఖ విడుదలైంది. ఈ నెల 3న వాజేడు మండలం కొంగాల అడవుల్లో కర్రెగుట్టపై వేట కోసం వెళ్లి బూబీట్రాప్స్‌పై కాలు వేయడంతో అది పేలి జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల ఏసు మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాదులు, కార్పొరేటర్ల ప్రయోజనాల కోసం అడవులను కట్టబెట్టడానికి మావోయిస్టు పార్టీపై, స్థానిక ప్రజలపై ఆపరేషన్ కగార్ పేరుతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. మార్చి 6న వేటగాళ్ల రూపంలో అడవుల్లోకి వచ్చిన గ్రేహౌండ్స్ బలగాలు ఇన్‌ఫార్మర్ల ద్వారా సమాచారం తెలుసుకొని తమ దళంపై దాడి చేశాయని, దాడిలో తమ సహచరులు సంతోశ్ అలియాస్ సాగర్‌తోపాటు మనీరామ్, లక్ష్మణ్‌లు అమరులయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి దాడుల నుంచి ఆత్మరక్షణ కోసం జనసంచారం లేని ప్రాంతాల్లో బూబీట్రాప్స్‌లను మావోయిస్టు పార్టీ అమర్చి.. ప్రజలను సైతం అటువైపు వెళ్లకుండా అప్రమత్తం చేస్తోందని తెలిపారు. పోలీసు బలగాలు సమాచార సేకరణతోపాటు తమ దారులను క్లియర్ చేసుకునేందుకు కొందరు అమాయకులను అడవుల్లోకి పంపి తమకు ఆత్మరక్షణగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే తాము అమర్చిన బూబీట్రాప్స్ పేలి అమాయకుడైన ఏసు బలయ్యాడని, దీనికి బాధ్యులు పోలీసులేనని లేఖలో పేర్కొన్నారు.